సాక్షి మంచిర్యాల

గురువారం ; 7 ; నవంబర్ ; 2024



మంచిర్యాలలో క్రిటికల్ కేర్

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ ఏర్పాటు కానుంది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చొరవతో నిధులు రూ.27 కోట్లు మంజూరు చేయించారు. 11లో▸

‘నేతకానిలను చిన్నచూపు చూడొద్దు’

భీమారం: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నేతకానిలకు మేలు జరిగే కార్యక్రమం చేపట్టాలని, కానీ చిన్నచూపు చూడొద్దని నేతకాని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కామెర శ్రీనివాస్ అన్నారు. నేతకానిలను మాల నేతకానిలుగా మార్చాలని ఎమ్మెల్యే కోరడంపై భీమారం బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, నాయకులు అనపర్తి తిరుపతి, డోర్న మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వార్డెన్లు, విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి



వార్డెన్, వంట సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, టీచర్లు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు విద్యార్థులు భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కుని పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను బుధవారం ఆయన పరామర్శించారు. బాలికలతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి ప్లేట్లు, వంటపాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని, వంటకు ఉపయోగించే నీరు, తాగేనీరు పూర్తిగా శుభ్రత కలిగి ఉండాలని తెలిపారు. ఆహార పదార్థాలు, తాగునీరు నమూనాలను పరీక్షల కోసం అధికారులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, డాక్టర్ అశోక్, డాక్టర్ సుమన్, డెమో బుక్క వెంకటేశ్వర్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గంగారాం పాల్గొన్నారు.

‘పిల్లల భవిష్యత్‌ను మార్చే రాజకీయాలు చేయండి’

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, మాజీ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ రాజకీయాలు మానుకుని, పిల్లల భవిష్యత్ మార్చే రాజకీయాలు చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల విషయంలో మాజీ మంత్రి మొసలి కన్నీరు కార్చాల్సిన అవసరం లేదని, గత పాలనలో విద్య, వైద్యం ఎలా ఉండేదో గుర్తు చేసుకుంటే బాగుంటుందని తెలిపారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉదయం కిచిడి తింటే ఒక్కరు మాత్రమే స్వల్ప అస్వస్థతకు గురయ్యారని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా మరో 11 మందిని ఆసుపత్రికి తరలించామని తెలిపారు. తన నియోజకవర్గంలో ఏ ఆశ్రమ పాఠశాలకైనా హరీశ్‌రావు వచ్చి ఫుడ్ మెనూ పరిశీలించాలని సవాల్ విసిరారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



మాట్లాడుతున్న రవికుమార్

బెల్లంపల్లి: ఆటల్లో గెలుపోటములు సర్వసాధారణమని, క్రీడాకారులు విజయం సాధించడానికి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డు సీఐడీ అడిషనల్ ఎస్పీ పి.రవికుమార్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి సింగరేణి తిలక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్, యూత్, సీనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. రవికుమార్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు హాజరయ్యారని అన్నారు. పోటీల్లో సత్తా చాటే క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. వచ్చే నెల 24, 25వ తేదీల్లో బెల్లంపల్లి కేంద్రంగా జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గం గుర్వేందర్, కార్యదర్శి ఎం.యాదయ్య, జిల్లా అధ్యక్షుడు ఏ.మహేష్, సెక్రెటరీ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సత్తిబాబు, కరీంనగర్ జిల్లా సెక్రెటరీ మోయిజ్, త్రో బాల్‌అసోసియేషన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు బలరాం, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీ

తాండూర్: తాండూర్ పోలీసు సర్కిల్ కార్యాలయం, మాదారం పోలీసుస్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. మాదారం ఠాణా పరిధి, భౌగోళిక పరిస్థితులు, గ్రామాల్లో కేసులు నమోదవుతున్న కేసుల తీరుపై ఆరా తీశారు. అంతకుముందు పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, సీఐ కుమారస్వామి, మాదారం ఎస్సై సౌజన్య పాల్గొన్నారు.

అస్వస్థతతో ఆందోళన!



మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వరుస ఘటనలు
- పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రుల్లో భయం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల అస్వస్థత ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధి వాంకిడి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురిని హైదరాబాద్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని గిరిజన బాలికల హాస్టల్‌లోనూ పదో తరగతి విద్యార్థినులు 12మంది స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా వాంతులు, వికారం రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం అందరూ క్షేమంగా ఉన్నారు. చలికాలం ఆరంభంలోనే ఉమ్మడి జిల్లాలో హాస్టళ్లలో వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో అటు తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నారు. మరోవైపు విద్యార్థుల ఆరోగ్యంపై జిల్లా ఉన్నతాధికారులు, గిరిజన, వైద్యాధికారులు అప్రమత్తం అయ్యారు. వాంకిడిలో జరిగిన ఘటనను రాష్ట్ర ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించడంతో హాస్టళ్లలో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఆరా తీస్తున్నారు.

అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 132 ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. వీటిలో 40వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. చాలా హాస్టళ్లలో విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందడం లేదు. దీంతో తరచూ జలుబు, దగ్గులతో బాధపడుతున్నారు. ఇక ఆహార పదార్థాలు, వంట చేయడం, శుచి, శుభ్రత కరువవుతోంది. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు మాత్రమే ఆగమేఘాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తున్నారు. జిల్లా పర్యవేక్షణ కమిటీ నిత్యం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులు బిజీగా ఉండడంతో తరచూ తనిఖీలు చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థులకు అరకొర వసతులతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. కలెక్టర్లు హాస్టల్‌లో నిద్ర చేసి, భోజనం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు వెళ్లిన సమయంలో జాగ్రత్తగా ఉంటూ మళ్లీ యథావిధిగా నిర్వహణ సాగుతోంది.

నిధుల లేమితో సమస్యలు

హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే అవసరమైన చోట నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఎవరైనా ఉన్నతాధికారులు వెళ్తే సమస్యల చిట్టా ముందు ఉంటోంది. విద్యార్థులకు ఆర్వో ప్లాంటు మరమ్మతులు, గదుల నిర్మాణం, మరమ్మతులు, విద్యార్థులకు మరుగుదొడ్లు, నిర్వహణ సామగ్రి అందించాలని కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల వద్ద నిధులు లేక సమస్య తీరుస్తామని హామీలు ఇస్తూ వచ్చేస్తున్నారు. దీంతో ఏళ్లుగా విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. చలికాలంలో వేడినీళ్లు అందించే సౌకర్యం లేక చాలాచోట్ల అవస్థలు పడుతున్నారు. గదుల్లో కిటికీలు, ఫ్యాన్లు సరిగా ఉండడం లేదు. దోమల నియంత్రణ లేకుండా పోతోంది. చాలా సమస్యలు ఉన్నప్పటికీ హాస్టల్ నిర్వాహకుల వద్ద సరైన బడ్జెట్ లేక ఉన్నంతలోనే నిర్వహిస్తున్నారు. ఇక విద్యార్థుల భోజనంలో సరైన నాణ్యత ఉండడం లేదు. సరకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు లోపభూయిష్టంగానే సరఫరా చేస్తున్నారు. బిల్లుల చెల్లింపులు, తక్కువ ధరకు టెండర్ వేయడం వంటివి నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి.

తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని సాయికుంట గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 10వ తరగతి విద్యార్థినులు 12 మందిని పరామర్శించారు. విద్యార్థుల అనారోగ్యానికి కారణం తెలుసుకునేందుకు ఫుడ్ సెఫ్టీ అధికారులతో తాగునీరు, ఆహారం నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించామని, పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య నిపుణులను పంపించి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న పచ్చడిని తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఆర్ఎంవో శ్రీధర్ పాల్గొన్నారు.

హాస్టల్ హెచ్‌ఎం సస్పెన్షన్..

మంచిర్యాల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్‌ఎం డీ.మాధవ్‌ను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. బాలికలు అస్వస్థతకు గురైన సమయంలో అందుబాటులో లేకపోవడం, ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళ్లడం, విధుల్లో నిర్లక్ష్యం చూపారని సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఎస్.శ్రీనివాస్‌కు హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగించారు. ఆయనతోపాటు వార్డెన్‌ను కూడా సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.

‘దిశ’ చూపాలి

- నేడు తొలి ‘దిశ’ సమావేశం
- ఎంపీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: డిస్ట్రిక్ డెవలప్‌మెంటు కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) తొలి సమావేశం గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు, ఆచరణ, సమన్వయం, సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహిస్తారు. జిల్లా పరిధిలోని ఎంపీ చైర్‌పర్సన్‌గా, జిల్లా ఉన్నతాధికారులు, సభ్యులు, ఆ ప్రాంత పరిధిలోని ప్రజాప్రతినిధులు హాజరు కావచ్చు. ఏడాదిలో నాలుగుసార్లు.. ప్రతీ మూడు నెలలకోసారి ఈ సమావేశం నిర్వహించాలి. 18వ లోక్‌సభ ఎన్నికైన తర్వాత దేశ వ్యాప్తంగా దిశ సమావేశాల నిర్వహణకు కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకే జిల్లాలోనూ ఏర్పాటు చేశారు. తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికైన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం సాగనుంది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరుకానున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దాదాపు 90పథకాలు అమలవుతున్నాయి. 31శాఖల పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధుల సమకూర్చడం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో విద్యా, వైద్య, ఆరోగ్య, మౌలిక సదుపాయాల కల్పన కోసం అనేక పథకాలు పర్యవేక్షించాల్సి ఉంది. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో కీలకంగా ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకం, పింఛన్లు, ఉచిత రేషన్‌బియ్యం, గ్రామీణ నైపుణ్యాభివృద్ధి పథకాలు, రూర్బన్ పథకం కింద అభివృద్ధి, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, గ్రామ సడక్ యోజన, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, బాలిక, మహిళా, శిశు, సంరక్షణ, నీటి పారుదల, నీటి సంరక్షణ, తదితర కీలక పథకాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూరుతున్నాయి. నిధుల ఖర్చు, లోపాలు, తదితర వాటిపై సమీక్షలు ఆ ప్రాంత ఎంపీతోపాటు జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో దిశ కమిటీ జిల్లా అభివృద్ధిలో కీలకంగా మారింది.

ధాన్యం సేకరణకు ఐరిస్

- ఈ సీజన్ నుంచి రైతుల ఐరిస్ సేకరణ
- ఇప్పటికే నిర్వాహకులకు 242 యంత్రాలు సరఫరా



ఐరిస్ యంత్రం

మంచిర్యాలఅగ్రికల్చర్: వరి ధాన్యం సేకరణలో అక్రమాలకు తావులేకుండా ఈ సీజన్ నుంచి ఐరిస్‌తో కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలో 242 ఐరిస్ యంత్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందజేశారు. గత యాసంగి సీజన్ నుంచి ఐరిస్ విధానం అమలుకు ప్రభుత్వం నిర్ణయించినా సాధ్యం కాలేదు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పకడ్బందీగా అమలుకు యంత్రాలు పంపిణీ చేశారు. గతంలో ఇతర ప్రాంతాల్లో అక్రమంగా కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా మిల్లులకు తరలించి రైతుల పేరిట విక్రయించి అక్రమాలకు పాల్పడ్డారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి కొనుగోలు కేంద్రాలు, కౌలు రైతుల పేరిట మిల్లులకు లారీల్లో తరలించారు. గత ఏడాది జిల్లాలోని కొన్ని చోట్ల రైతులు అడ్డుకుని ధర్నాలు, ఆందోళనలు చేశారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పట్టా పాస్‌పుస్తకంతోపాటు ఆధార్ నంబరు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, రైతు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీతోపాటు కొత్తగా ఐరిస్ ప్రవేశపెట్టారు. గతంలో ధాన్యం విక్రయించిన సమయంలో బయోమెట్రిక్ ద్వారా రైతుల వేలిముద్రలు తీసుకున్నారు. సిగ్నల్స్, సాంకేతిక సమస్య వల్ల థంబ్ మిషన్లు పని చేయలేదు. ఇప్పుడు వాటిని పక్కనపెట్టి ఐరిస్ యంత్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నారు. ఈ సీజన్‌లో దొడ్డు రకం, సన్నరకం ధాన్యం వేర్వేరుగా సేకరణకు చర్యలు చేపట్టారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతోపాటు అదనంగా బోనస్ రూ.500 చెల్లిస్తుంది. ఈ క్రమంలో అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలు

ఈ ఏడాది 1.60లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉండగా.. 3.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, ఇందులో రైతుల అవసరాలకు పోను 3.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం సేకరణకు ఐకేపీ 132, పీఏసీఎస్ 129, డీసీఎంఎస్ 51, మెప్మా 10 మొత్తంగా 326 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించగా.. 303 కొనుగోలు కేంద్రాలు గుర్తించారు. ఇప్పటివరకు 17చోట్ల కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, గోదాం, టార్పాలిన్లు, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ధాన్యం క్లీనర్లు తదితర ఏర్పాట్లతోపాటు 242 ఐరిస్ యంత్రాలు నిర్వాహకులకు అందజేశారు. మిగతావి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. కౌలు రైతులు ఏఈవోల ద్వారా కౌలుపత్రం పొంది ఓపీఎంఎస్(ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంటు మేనేజ్‌మెంటు సిస్టం)లో నమోదు చేయనున్నారు. దీని ద్వారా ధాన్యం విక్రయానికి అనుమతి ఇస్తారు. దీంతోపాటు ఆధార్ కార్డు, బ్యాంకు బుక్ జిరాక్స్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఐరిస్ యంత్రం ద్వారా కౌలురైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని మండలాల్లో నిర్వహిస్తున్న అవగాహన సమావేశాల్లో అధికారులు సూచిస్తున్నారు.

అక్రమాలకు తావులేకుండా..

ఈ సీజన్ నుంచి ఐరిస్ యంత్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టడం జరుగుతుంది. గత యాసంగి సీజన్ నుంచి ఐరిస్ మిషన్లు అమలు చేయాలని నిర్ణయించినా ధాన్యం సేకరణ ప్రారంభం కావడంతో వినియోగించలేదు. అక్రమాలకు తావు లేకుండా ఐరిస్ యంత్రాలు వినియోగిస్తున్నాం. గత యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అనుగుణంగా 242 ఐరిస్ యంత్రాలు అందజేశాం.

– శ్రీకళ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

కుటుంబ సర్వేకు బ్రేక్

- ప్రశ్నావళిలో స్వల్ప మార్పులు
- ఈ నెల 9నుంచి పునఃప్రారంభం



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రశ్నావళి పత్రం

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం ప్రారంభం కావాల్సి ఉండగా ప్రశ్నావళిలో స్వల్ప మార్పుల కారణంగా బ్రేక్ పడింది. ఇప్పటికే అధికారులు, సిబ్బంది నియామకంతోపాటు ప్రశ్నావళి పత్రాలు, తదితర సామగ్రి అందజేశారు. జిల్లాలో ఇప్పటికే 2.48 లక్షల ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. 18 మంది ప్రత్యేక అధికారులు, 203 మంది సూపరింటెండెంట్లు, 1990 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఇంట్లో కుటుంబ సభ్యుల వివరాలు, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, ఆదాయం, భూమి, రాజకీయ తదితర వివరాల సేకరణకు సిద్ధం కాగా ప్రభుత్వ ఆదేశాలతో అర్ధంతరంగా సర్వే నిలిపి వేశారు. ప్రశ్నావళిలో 75 అంశాలు ఉండగా ఇందులో ప్రధానంగా 56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నల ద్వారా ప్రజల వివరాలు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇందులో ప్రజల గోప్యత, కులం, మతంపై కోర్టులో పిటిషన్ వేయగా ‘కులం, మతం లేదు’ అనే కాలమ్ చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతోపాటు ఆర్థిక, ఆదాయం, భూమి పాస్‌బుక్ వివరాలు, రాజకీయ, తదితర 7 నుంచి 9వరకు అంశాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయని బుధవారం జరగాల్సిన సర్వే నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నల్లో మార్పులు చేర్పులతో ఈ నెల 9లోపు మరో ప్రశ్నావళి ప్రతం ముద్రించి ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అర్ధంతరంగా నిలిచిన సర్వే

సర్వేకు ప్రతీ పది మంది ఎన్యురేటర్లకు ఒక పరిశీలకుడు చొప్పున నియమించారు. పర్యవేక్షణ అధికారులకు విడతల వారీగా సర్వేపై జిల్లా కలెక్టర్ శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలల టీచర్లు, ఉన్నత పాఠశాలల బోధనేతర సిబ్బంది, ప్రభుత్వ విద్యా సంస్థల్లోని కాంట్రాక్టు గెస్ట్ టీచర్లను నియమించారు. సర్వేకు అన్ని సిద్ధమై ఇళ్లకు వెళ్లాల్సి ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాలతో నిలిపివేసినట్లు జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి ఖాసీం మహ్మద్ తెలిపారు. ఈ నెల 9 నుంచి సర్వే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

- ఎమ్మెల్యే వివేక్ ముందే తోపులాట
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మండల కేంద్రంలోని ఇందారంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ముందే కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. బుధవారం డీఎంఎఫ్‌టీ నిధులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై మండల అధ్యక్షుడు ఫయాజ్ కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండానే ఎమ్మెల్యేను ఆహ్వానించారని జక్కుల వెంకటేశం ఎమ్మెల్యే వివేక్‌కు ఫిర్యాదు చేశారు. ఫయాజ్ స్పందిస్తూ తనపై వ్యక్తిగతంగా కక్షగట్టి గొడవ సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రతీ ఒక్కరికి వాట్సాప్ ద్వారా సమాచారం పంపించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఒకరినొకరు దూషించుకుంటూ తోపులాటకు దిగడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ గొడవతో అసహనానికి గురైన ఎమ్మెల్యే గ్రామంలోని ఎస్సీ కాలనీలో మరో కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. అంతకుముందే నర్వ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.

‘మావో’ల లేఖపై ఖాకీల పోస్టుమార్టం

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ విడుదల చేసిన హెచ్చరికల లేఖపై పోలీసు యంత్రాంగం దర్యాప్తు చేపట్టింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కొందరు కాంగ్రెస్ నాయకులు, భూకబ్జాదారులను లక్ష్యంగా చేసుకుని హెచ్చరించడంతో అన్ని కోణాల్లో విచారణ చేపట్టింది. లేఖపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు ఒకరు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. లేఖలోని నిజాలను నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆ లేఖ ఏ ప్రాంతం నుంచి పంపించారు, ఏ పత్రికలో ముందుగా ప్రచురితమైంది, నిజమైనాదేనా..? మావోయిస్టుల పేరిట మరెవరైనా విడుదల చేశారా..? మాజీల ప్రమేయం ఏమైనా ఉందా, ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ భూములు కబ్జా చేసింది వాస్తవమేనా.. గంజాయి, రౌడీమూకలు రెచ్చిపోవడానికి కారకులెవరు అనే కోణాలు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తులు, అనుమానితులను విచారణ చేస్తున్నారు. దర్యాప్తు తీరుపై రోజువారీగా ఉన్నతశ్రేణి పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తోంది.

కమిషనరేట్ పరిధిలోనే హెచ్చరికలు

మరెక్కడా లేని విధంగా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోనే మావోయిస్టుల హెచ్చరిక లేఖలు విడుదల అవుతుండడంతో పోలీసు వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, వీరంతా పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించడం, విలువైన ప్రభుత్వ, సింగరేణి భూముల కబ్జా, రౌడీల దౌర్జన్యాలు, భౌతికదాడులు, గంజాయి అక్రమ రవాణా తదితర అంశాలను మావోయిస్టులు లేఖలో ప్రస్తావించడం సంచలనమైంది. మావోయిస్టుల లేఖ పోలీసు ఉన్నతాధికారులకు మింగుడుపడని అంశంగా మారింది. ఈ ప్రాంతంలో మావోయిస్టులను సమూలంగా అణచివేసినా యథాతథంగా లేఖలు వస్తుండడం అధికారులను అసహనానికి గురి చేస్తోంది. లేఖల పరంపరను తీవ్రంగా పరిగణిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

అటవీ సంపదను రక్షించుకోవాలి



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న పూర్ణచందర్

కాసిపేట: అటవీ సంపదను రక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అటవీ శాఖ బెల్లంపల్లి డివిజన్ అధికారి పూర్ణచందర్ తెలిపారు. పెద్దపులులు ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో సంచరించడంతో బుధవారం అడవిని ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంలు, నీటికుంటలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీతాకోక చిలుకలతోపాటు అడవిలో నీటి వనరులు సంవృద్ధిగా ఉండి వన్యమృగాలు, ప్రాణుల ఆవాసానికి అనుకూలంగా ఉండడంతో వన్యప్రాణులు సంచరిస్తున్నాయని తెలిపారు. అడవుల సమీపంలో రైతులు పంటల రక్షణకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడం, అటవీ జంతువులను వేటాడడం చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, ఎఫ్‌బీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

వరి, పత్తి కొనుగోళ్లపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామ రైతువేదికలో బుధవారం వరి, పత్తి కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు వరి పంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతనే కోయాలని సూచించారు. హార్వెస్టర్ స్పీడ్ 18ఆర్‌పీఎం ఉండేలా చూడాలని, పొలం వద్దనే వడ్లు ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. పత్తిలో పాటించాల్సిన మెళకువలు, నాణ్యతా ప్రమాణాలపై జిల్లా వ్యవసాయాధికారి కల్పన వివరించారు. జిల్లా సహకార సంఘం అధికారి జి.సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఏడీఏ బానోతుప్రసాద్, తహసీల్దార్ మల్లి కార్జున్, ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజనుల సంక్షేమానికి చర్యలు



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్యం, ఉపాధి కోసం, యువత మానసిక వికాసం కోసం శ్వషోధన్, ధర్మసేవ సంస్థలతో కలిసి ముందుకు వెళ్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో హైదరాబాద్‌లోని శ్వషోధన్, ధర్మసేవ సంస్థల ప్రతినిధులు డాక్టర్ పులపల్లి కరుణాకర్‌రెడ్డి, జె.నిషాంత్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఈ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలపై పీవో ఖుష్బూ గుప్తా చర్చలు జరిపారు. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సల్లా అనిల్, స్రవంతి, డాక్టర్ సంపత్, నిషాంత్, వెంకట్, రాధిక, భార్గవ్‌లు పాల్గొన్నారు.

డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు

మంచిర్యాలక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై విచారణ అనంతరం మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని వినూత్న తీర్పునిచ్చారు. స్థానిక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు ఇటీవల కాలంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. కాగా విచారణ అనంతరం బుధవారం 27మందికి స్థానిక మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని జైలు శిక్షకు బదులుగా జిల్లా కేంద్రం కాలేజీరోడ్‌లోని మాత శిశు కేంద్రం ఆసుపత్రిలో వారం రోజుల పాటు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పారిశుధ్యం పనులు చేయవల్సిందిగా తీర్పునిచ్చారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాజ్‌కుమార్

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జి ల్లాప రిషత్ ఉన్నత పా ఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజ్‌కుమార్ అనే విద్యార్థి ఈనెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 విభాగంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో ఆడటానికి అర్హత సాధించాడు. ఈనెల 7వ తేదీ నుంచి యదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా జట్టు తరఫున రాజ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. సదరు విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అభినందించారు.

సింగరేణి సత్తా చాటుతాం

- ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆశాభావం
- కోలిండియా పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు



సింగరేణిస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీల్లో సింగరేణి సత్తా చాటుతామని కంపెనీస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో బుధవారం ముగిశాయి. పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విన్నర్‌గా, ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్లు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా డబ్ల్యూపీఎస్‌అండ్ జీఏ సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయనుంది. కాగా సింగరేణిలో గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. కోలిండియా స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా టర్ఫ్, గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టులు ఉంటాయని, సింగరేణి స్థాయిలో అలాంటి కోర్టులు లేకపోవడంతో కోలిండియా స్థాయి పోటీల్లో ఆడడం సింగరేణిస్థాయి క్రీడాకారులకు ఇబ్బంది ఉంటుందని పేర్కొంటున్నారు. క్రీడాకారుల ఇబ్బందులను యాజమాన్యం గుర్తించి సింగరేణి స్థాయిలో ఒక గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయాలని, కోలిండియా పోటీలకు వెళ్లే ముందు క్రీడాకారులకు కనీసం నెల రోజులైనా ప్రత్యేక కోచ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలని సీనియర్ క్రీడాకారులు సూచిస్తున్నారు.



విన్నర్ షీల్డ్ అందుకుంటున్న శ్రీరాంపూర్ జట్టు



రన్నర్ షీల్డ్ అందుకుంటున్న ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్టు

ముగిసిన కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలు

మందమర్రిరూరల్: కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ పోటీల్లో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం సాధించింది. రన్నరప్‌గా ఆర్జీ -1, ఆర్జీ -2 జట్టు నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ ట్రోఫీలు అందజేశారు. ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, ఏరియా కోఆర్డినేటర్ శివకృష్ణ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ అశోక్, రమేశ్, జాన్ వెస్లీ, టీం మేనేజర్స్, క్రీడాకారులు ఉన్నారు.

27సార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నా..



నేను 1995వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఫుట్‌బాల్‌పై ఉన్న మక్కువతో విద్యార్థి దశ నుంచే ఆటలో మెలకువలు నేర్చుకున్నాను. సింగరేణిలో పోటీల్లో పాల్గొని సత్తాచాటి కంపెనీ లెవల్ స్థాయికి ఎదిగాను. ఇప్పటివరకు 27సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.

– సామల సత్యనారాయణ, జనరల్ మజ్దూర్, ఆర్జీ –1 ఏరియా

కోలిండియా పోటీల్లో సత్తా చాటుతా..



సింగరేణిలో 2015వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఇప్పటి వరకు 12సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహంతో వచ్చే నెలలో జరుగబోయే కోలిండియా పోటీల్లో పాల్గొని సత్తా చాటుతాను.

– బెల్లం తిరుపతి, శ్రీరాంపూర్ ఓసీ, జనరల్ మజ్దూర్

సింగరేణి ప్రోత్సాహం బాగుంది..



సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహం బాగుంది. సింగరేణిలో 1998లో ఉద్యోగంలో చేరి ఫుట్‌బాల్ క్రీడలో నైపుణ్యం సాధించాను. ఇప్పటి వరకు నాలుగుసార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నాను. వచ్చే నెలలో జరిగే కోలిండియా పోటీల్లో పాల్గొని సింగరేణి యువ క్రీడాకారులతో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తాం.

– బొంగోని చిన్నన్న, ఎస్టీపీపీ ఎస్‌అండ్‌పీసీ విభాగం

సంస్థకు గుర్తింపు తీసుకురావాలి



సింగరేణిలో నైపుణ్యం కలిగిన మంచి క్రీడాకారులు ఉన్నారు. వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీలకు యాజమాన్యం సిద్ధంగా ఉంది. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సింగరేణి సత్తాచాటి సంస్థకు గుర్తింపు తీసుకురావాలి.

– చట్ల అశోక్, డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సెక్రెటరీ

జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

దండేపల్లి: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్14 బాలబాలికల విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈవో చిన్నయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు విద్యార్థులకు శారీరకంగా ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయన్నారు. పోటీల్లో 26 బాలుర జట్లు, 12 బాలికల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఫణిరాజా, పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



గేడం శ్రీనివాస్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధి పాటగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. పాటగూడ గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్(25) గత సంవత్సరం కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు. కొంత ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. అయితే గత నెల రోజులుగా మళ్లీ మతిస్థిమితం కోల్పోయి ఎవరితోనూ మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గ్రామానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కోసుబాయి ఉన్నారు.

దుబాయ్‌లో తెలంగాణవాసి ఆత్మహత్య



సాయిరాం(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌పేట్ గ్రామానికి చెందిన బామండ్ల నర్సు –సాయన్నల కుమారుడు సాయిరాం(24) దుబాయ్‌లో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం సోదరి వివాహానికి వచ్చి తిరిగి వెళ్లాడు. కాగా మంగళవారం బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అక్కడున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. త్వరగా మృతదేహాన్ని ఇండియాకు చేర్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు, గల్ఫ్ సంఘాల నాయకులు కృషి చేయాలని కోరుతున్నారు.

చెరువులో పడి కార్మికుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ 24 డీప్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడు పులి రాజ్‌కుమార్(52) బెల్లంపల్లి పోచమ్మ చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం రాజ్‌కుమార్ తన స్నేహితుడి తమ్ముడి ఐదు రోజుల కర్మ కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా అతని ఆచూకీ లభించలేదు. బుధవారం పోచమ్మ చెరువులో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. స్నానం చేయడానికి చెరువులో దిగగా జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పదంగా మారిన తోళ్లపరిశ్రమ భూమి



ఎమ్మెల్యే వివేక్‌కు రికార్డులు చూపిస్తున్న సింగరేణి అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో 20 ఏళ్ల క్రితం సింగరేణి సంస్థ ప్రభుత్వం ద్వారా తోళ్ల పరిశ్రమకు కేటాయించిన 25 ఎకరాల భూమి వివాదాస్పదంగా మారింది. పరిశ్రమ మధ్యలో నుంచి సింగరేణి అధికారుల ప్రోద్బలంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయడంతో తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో పలు ఆందోళనలు చేయడంతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు విన్నవించుకున్నారు. కాగా బుధవారం ఎమ్మెల్యే వివేక్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులను సందర్శించి, తోళ్ల పరిశ్రమ వద్దకు వచ్చారు. సింగరేణి అధికారులతో పాటు తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా నాయకులతో మాట్లాడారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు తోళ్ల పరిశ్రమ భూమి విషయంలో జాయింట్ సర్వే నిర్వహించాలని, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.20 లక్షలు కేటాయించాలని సూచించారు. జాయింట్ సర్వే అయ్యేంత వరకు సింగరేణి అధికారులు అటువైపు వెళ్లకూడదని ఆదేశించారు. ఆయన వెంట సింగరేణి ఏరియా అధికారులు, తోళ్ల పరిశ్రమ సాధన సమితి సభ్యులు, మాదిగ హక్కుల దండోరా నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అమ్మవారి ప్రసాదం అందజేత

బాసర: ట్రిపుల్‌ఐటీ కళాశాలలో వీసీ గోవర్ధన్‌కు ఆలయ కార్యనిర్వాణాధికారి విజయరామారావు, బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్, పూజారి, వేద పండితులు నవీన్ శర్మ బుధవారం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాలలో విద్యార్థులతో పాటు పాల్గొనాలని ఆహ్వానించారు.

లక్సెట్టిపేట రేంజ్ దాటుతున్న పెద్దపులి?

కాసిపేట: కాసిపేట మండలం ముత్యంపల్లి సెక్షన్, లక్సెట్టిపేట రేంజ్ మేడారం సెక్షన్‌లలో సంచరించిన పెద్దపులి బొక్కలగుట్ట, మంచిర్యాల, హాజీపూర్ మండలం అటవీప్రాంతం దాటుతూ రేంజ్ పరిధిలోని టీకానపల్లి వైపు వెళ్లినట్లు అటవీ అధికారులు తెలిపారు. లక్సెట్టిపేట రేంజ్ అధికారి సుభాష్ మాట్లాడుతూ పెద్దపులి టీకానపల్లి ప్రాంతం వరకు వెళ్లినట్లు గుర్తించామన్నారు. తరువాత మళ్లీ గుట్ట దాటి ఎటు వెళ్తుందో గుర్తించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు పాదముద్రల ఆధారంగా పులి కదలికలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ట్రాప్ కెమెరాల్లో పులి చిక్కలేదన్నారు.

డబ్బు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నస్పూర్: సైబర్ మోసంలో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తో పాటు తన బంధువులు, స్నేహితులు రూ. 1,57,319లను పోగొట్టుకున్నట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత సెప్టెంబర్20న సైబర్ నేరగాళ్లు శివకుమార్ ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో అడ్వర్టైజ్‌మెంట్ లింక్‌ను పంపించారు. లింక్ ఓపెన్ చేయగానే టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అను గుర్తు తెలియని వ్యక్తి ప్రొఫైల్‌తో పాటు మరి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. ఈక్రమంలో గ్రూప్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపారు. దీంతో పలు దఫాలుగా శివకుమార్‌తో పాటు ఆయన బంధువులు రూ.1,57,319 ఫోన్‌పే ద్వారా పంపించారు. తర్వాత వారి ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'క్రిప్టో' పేరుతో సైబర్ మోసం

నస్పూర్: సైబర్ నేరగాళ్ల మోసానికి నస్పూర్ మండలం సీతారామపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ. 67వేలు కోల్పోయినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల అక్టోబర్ 10న ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజీ అడ్వర్టైజ్‌లో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని సైబర్ నేరాగాళ్లు ఆశ చూపారు. ఈక్రమంలో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన అకౌంట్‌కు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడం.. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం నంబర్ 1930కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాడి అకౌంట్‌లోని రూ. 32వేలు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతిభగల క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా నెలవు

- ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు
- ఉత్సాహంగా జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు



రెజ్లింగ్ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతిభగల క్రీడాకారులకు నెలవని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి ఖోఖో, రెజ్లింగ్, రగ్బీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 3వ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా స్టేట్‌మీట్ పోటీల్లో విజేతలుగా నిలిచేందుకు శ్రమించాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. అండర్ 17 ఖోఖో బాలికల జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 8 నుంచి ఖమ్మం జిల్లాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాష్ట్రపాల్ మాట్లాడుతూ జిల్లాలో అండర్ 17 బాలబాలికల పోటీలు నిర్వహించామన్నారు. ఈ జోనల్ స్థాయి పోటీల్లో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా జట్లు పోటీ పడ్డాయని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ్దేవ్ మాట్లాడుతూ జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం లస్మన్న, సీనియర్ పీడీ రామ్మోహన్, దయానంద్ రెడ్డి, హరిచరణ్ తదితరులు ఉన్నారు.

9న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ జిల్లాల క్రికెట్ ఎంపిక పోటీలను ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ అంకయ్య, ఆర్గనైజర్ పీడీ నూనె శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల జెడ్పీపీహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు క్రీడాకారులు యూనివర్సిటీకి చెల్లించిన అప్లికేషన్ రశీదు, ఐడి కార్డ్, ఆధార్ కార్డ్, ఎంట్రీ ప్రొఫార్మాతో పాటు 2 ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94415 50877, 70364 46695 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన చదరంగం పోటీలు



గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురదగూడెంలో గల లిటిల్‌ఫ్లవర్ హై స్కూల్‌లో రెండు రోజులు జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ అండర్ 14, 17 విద్యార్థుల చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉల్ రెహ్మాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చదరంగం అభివృద్ధి చైర్మన్ కనకయ్య, పాఠశాల కరస్పాండెంట్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక మహోత్సవం



మహిళా భక్తులు వెలిగించిన దీపాలు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో కార్తిక మహోత్సవం పూజలు వైభవంగా జరుగుతున్నాయి. కార్తీక మాస ప్రదోషకాల నిత్య దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వెలేటి పవన్ శర్మ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య విరచిత సౌందర్యలహరి పారాయణం భక్తులకు వివరించారు. దీపోత్సవం పూజాకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవ క్రతువును తిలకించారు. శ్రీ సత్యసాయి నాట్య అకాడమీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువు చంద్రశేఖర్, కళాకారులు శ్రేష్ఠ, మనోజ్ఞ, భావన, లహరి పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీకి 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి మండల వైద్యాధికారి వైద్యసేవలు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఖండాల సబ్‌సెంటర్ పరిధిలోని రాజుగూడ గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుంది. సబ్ సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది చికిత్స కోసం పీహెచ్‌సీకి రావాలని ఎన్నిసార్లు నచ్చజెప్పినా ఆమె రాలేదు. దీంతో మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫరాజ్ 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య చికిత్స అందజేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ మోహినొద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు రాథోడ్ చంద్రకళ, పవర్ ఫ్రేంసింగ్ తదితరులు ఉన్నారు.